ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 1 ఆగస్టు 2024

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ 8లో..

సింగరేణిని ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం 8లో..



సాగు జోరు

- 1,64,596 ఎకరాల్లో పంటల సాగు
- ఎస్సారెస్పీ నీటి మట్టాలపై రైతుల ఆందోళన
- నిండకుంటే తగ్గనున్న సాగు విస్తీర్ణం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గత వారం, పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంటల సాగు జోరుగా సాగుతున్నది. ఇప్పటి వరకు 1,64,596 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కాగా, అంచనా మేరకు ఇంకా లక్షా 15 వేల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉంది. జిల్లా రైతులకు వర ప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి అంతగా వరద నీరు రాక పోవడంతో రైతులకు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో ఆశించిన మేరకు వర్షాలు కురవక పోవడంతో ప్రాజెక్టులోకి ఆశించిన మేరకు నీళ్లు రావడం లేదు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 36 టీఎంసీలకు చేరుకున్నది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76 టీఎంసీల నీళ్లు ఉండగా, ఆయకట్టు భూములకు సాగు నీటిని కూడా విడుదల చేశారు. అప్పటికీ, ఇప్పటికీ 40 టీఎంసీల నీళ్లు తక్కువగా ఉన్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 2,77,003 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 2,09,381 ఎకరాలు, 780 ఎకరాల్లో మొక్కజొన్న, 6.27 ఎకరాల్లో పెసర, 5 ఎకరాల్లో మినుము, 159 ఎకరాల్లో కంది, 16 ఎకరాల్లో బబ్బెర, 18 ఎకరాల్లో వేరుశెనగ, 5 ఎకరాల్లో నువ్వులు, 57,704 ఎకరాల్లో పత్తి పంట, 8,928 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు కానున్నాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు వరి 1,12,260 ఎకరాల్లో వరి, 51,595 ఎకరాల్లో పత్తి, 119 ఎకరాల్లో కంది, 3 ఎకరాల్లో సోయాబీన్, 601 ఎకరాల్లో మొక్కజొన్న, తదితర పంటలు మొత్తం 1,64,596 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

● ఆశాజనకంగా వర్షాలు..

జిల్లాలో వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నాటి నుంచి వర్షాలు ఆశాజనకంగాను కురుస్తున్నాయి. జూన్, జూలై మాసాల్లో జిల్లాలో సాధారణ వర్షపాతం 454.2 మిల్లీ మీటర్లకు 636.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణానికంటే 40 శాతం వర్షం అదనంగా కురిసింది. దీంతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండి మత్తడులు దుముకుతున్నాయి. చెరువులు, కుంటల కింద, వ్యవసాయ బావుల కింద ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు భూముల్లోనూ రైతులు కొందరు వరినాట్లు వేస్తున్నారు. 15 రోజుల వరకు నీళ్లు లేకున్నా పంటకు నష్టం కలగదని, అడపాదడపా కురిసే ఈ వర్షాలతో పంటకు ఢోకా ఉండదనే ధైర్యంతో నాట్లు వేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటి మట్టం 50 టీఎంసీలకు చేరితే తప్పకుండా ఈ సీజన్‌కు ఆయ కట్టు భూములకు సాగు నీటిని విడుదల చేస్తారనే భరోసాతో ఉన్నారు. మరికొంత మంది రైతులు ఆయకట్టు భూముల్లో వరి నాట్లు వేయాలా, వద్దా అని ఆలోచన చేస్తున్నారు. ఎస్సారెస్పీ నిండకుంటే ఈ సీజన్ ఏమోగానీ వచ్చే యాసంగి సీజన్‌లో మాత్రం జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గనున్నది. సాధారణంగా ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో ఆగస్టు 15 వరకు ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు వేయడం పూర్తి చేస్తారు. నీళ్లు రావడం ఆలస్యమైతే ఆగస్టు నెలాఖరు వరకు కూడా వరి నాట్లు వేస్తారని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి వరద వస్తున్నప్పటికీ, ఎస్సారెస్పీకి తక్కువగా ఉన్నది. నంది మేడారం రిజర్వాయర్, గుండారం రిజర్వాయర్ల కింద వరి నాట్లు ముగింపు దశకు వస్తున్నాయి. ఎల్లంపల్లిలో సరిపడా నీళ్లు ఉండడంతో ఈ రెండు రిజర్వాయర్లలో సాగు నీటికి ఢోకా ఉండదు. వారంరోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరగనున్నదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా జరిమానా పెంపు

- ట్రాక్టర్‌కు రూ.25 వేలు, లారీకి లక్ష.. : కలెక్టర్

పెద్దపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడే ట్రాక్టర్లకు 5 వేల నుంచి 25వేలు, లారీలకు 50వేల నుంచి లక్ష రూపాయల వరకు పెంచుతు న్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఇసుక రవాణాపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, డీసీపీ ఎం చేతనలతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 18 ఇసుక రీచ్‌లను ఈ ఏడాది మే 31న ఎన్‌జీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు మూసివేశా మన్నారు. నీటిపారుదల శాఖ పరిధిలోని పనులు కొనసాగించేందుకు కేటాయించిన ఇసుక రీచ్‌ల నుంచి ఇప్పటివరకు తరలించిన ఇసుక, పనుల నిర్వహణకు అవసర మైన ఇసుక వివరాలతో కూడిన నివేదిక అందిస్తే నీటిపారుదల శాఖ పనులకు ఇసుక కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఖమ్మంపల్లి ఇసుక రీచ్ వారంరోజులలో ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా నిర్వహిస్తూ పట్టుబడిన ట్రాక్టర్‌లకు విధించే జరిమానాలను 5 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయలకు, లారీలకు విధించే జరిమానాన్ని 50 వేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పెంచుతూ జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మైనింగ్ ఏడీ పి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, ఏసీపీలు, మైనింగ్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శిశువుకు తల్లిపాలే రక్ష అని, తల్లి పాల వారో త్సవాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అదనపుకలెక్టర్ జే అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని తన చాం బర్‌లో తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 1నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం తల్లిపాల వారోత్సవాలలోని ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా జిల్లాలో నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో వైద్యశాఖ అధికారులు, ఐసీడీఎస్ సంయుక్తంగా సమావేశం నిర్వహించి తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహిం చాల్సిన కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 31: గోదావరిఖని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు వి ద్యార్థులకు క్రీడలు కూడా నేర్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలకు పూర్తి స్థాయిలో క్రీడలను అందించాల్సిన అవసరం ఉందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సానియా మిర్జా, గుప్తా జ్వాల లాంటి క్రీడాకారులను తయారు చేసిందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ స్కూల్స్‌ను అభివృద్ధి చేయా లని, క్రీడా కారులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని, పాఠశాలల్లో మైదానాలు ఏర్పాటు చేసి పీఈటీలను నియమించాలని కోరారు.

గోదావరిఖనిలో ఇంటర్నేషనల్ క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలి...

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు అనుబంధంగా గోదావరిఖనిలో ఇంటర్నేషనల్ క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ రెండు జి ల్లాలకు అనువుగా ఉన్న గోదావరిఖనిలో ఈ మైదానాన్ని ఏర్పాటు చేస్తే క్రీడాకారుల కు ఉపయోగంగా ఉంటుందని ఆయన చెప్పారు.

అన్యాక్రాంతం అవుతున్న దేవాదాయ భూములను కాపాడాలి

పెద్దపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రెవెన్యూ శివారులో అన్యాక్రాంతం అవుతున్న దేవాదాయ శాఖ భూములకు కాపాడి, హద్దులు నిర్ణయించాలని రాష్ట్రీ య హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్ దేవాదాయ శాఖ అసి స్టెంట్ కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్ రోడ్డులో సర్వే నంబర్ 525లో రెండు ఎకరాల గోశాల స్థలం, సర్వే నంబర్ 584(ఓల్డ్ నంబర్ 708)లో ఎకరం 20గుంటల గోశాల స్థలం, సాగర్ రోడ్డులోగల సర్వే నంబర్ 791లో ఎకరం 4గుంటల శ్రీసీతారామస్వామి దేవాలయం భూమి, సర్వేనంబర్ 649-650లో గల 5ఎకరాల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూములు అన్యాక్రాంతానికి గుర య్యాయని పేర్కొన్నారు. మొత్తం 8 ఎకరాల 34 గుంటల భూమిలో కొంత భూమి అన్యాక్రాంతం అయ్యిందని, భూమలను గుర్తించి హద్దులు నిర్ణయించాలని కోరారు.

ఖని ప్రభుత్వాసుపత్రి ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

కళ్యాణ్‌నగర్, జూలై 31: గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎల్‌టీ అప్రెం టిస్‌షిప్ కోసం వచ్చే విద్యార్థుల వద్ద అదనపు డబ్బులు వసూలు చేయడాన్ని నిర సిస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదు ట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో ఎంఎల్‌టీ చేయడానికి వచ్చే విద్యార్థుల వద్ద అదనంగా రుసుము వసూలు చేస్తు న్నారని, విద్యార్థులు ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక ఇక్కడికి వస్తే వారిని ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌వో చర్యలు తీసుకు ని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని, లేకపోతే ఆందోళన ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. రాహుల్, మనోహర్, ప్రణీత్, వినయ్ పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ఇబ్బందులు ఎదుర్కొన్న రోగులు, చిన్నారులు



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న రోగులు

కళ్యాణ్‌నగర్, జూలై 31: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవా రం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో రోగులు విలవిలలాడారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సబ్‌స్టేషన్ నుంచి నూతనంగా నిర్మించిన 80పడకల ఆసుపత్రికి వెళ్లే విద్యుత్ లైన్‌పై భారీ వాహనం వెళ్లడంతో ఆ లైన్ తెగిపోయింది. దీంతో రాత్రి 11గంటల నుంచి బుధవారం సాయంత్రం వరకు పనులు చేపట్టకపో వడంతో చీకట్లోనే మగ్గారు. చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చికి త్సకు అంతరాయం కలిగింది. రక్తనమూనాల సేకరణ, ఈసీజీ, టుడీ ఎకో వంటి పరీ క్షలు చేయడానికి వైద్యులు కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉక్కపోతతో రోగు లు ఉక్కిరిబిక్కిరయ్యారు. దీనిపై సూపరింటెండెంట్ స్పందించకపోవడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవ డంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మి స్తున్న ఐదు అంతస్థుల భవనాలకు ఇనుము, కంకర తీసుకువచ్చే భారీ వాహనాలు విద్యుత్‌లైన్ పైనుంచి వెళ్లడంతో లైన్ తెగిపోయింది. కాంట్రాక్టర్ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. రోగులు, వారి బంధువులు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లి తక్షణమే విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భారీ వాహనం వెళ్లడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని, కరీంనగర్ నుంచి విద్యుత్ కేబుల్ తీసుకురావడంలో జాప్యం జరిగిం దని, బుధవారం రాత్రి 7గంటల వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఆర్ ఎంవో అప్పారావు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

- పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి - మున్సిపల్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్ శ్రీహర్ష



మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని, జూలై 31: మంథని ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మండలంలోని వెంకటాపూర్, అడవిసోమనపల్లి గ్రామాల్లో ఉన్న ఇసుక రీచ్‌లను, మంథని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, పుర పాలక శాఖ కార్యాలయాన్ని, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయాన్ని, ఐబీ అతిథిగృహాన్ని బుధవారం పరిశీలించారు. మండలంలోని ఇసుక రీచ్‌ల వద్ద కట్టిన ట్రెంచ్ లను పరిశీలించి అక్రమ ఇసుక రవా ణా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయం ఆవరణను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఆధునికీకరణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఐబీ అతిథి గృహంలో రినోవేషన్ పనులను పరిశీలించిన తర్వాత పెండిం గ్ పనులు నెలరోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సంబంధిత ఏజె న్సీలను ఆదేశించారు. మంథని పట్టణంలోని పురపాలక కార్యాల యాన్ని పరిశీలించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవల ప్‌మెంట్ కార్పొరేషన్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై రివ్యూ నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సూచనల మేర కు మంథని పట్టణంలో నూతన పురపాలక కార్యాలయం, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, డంపింగ్‌యార్డు నిర్మాణానికి సంబంధించి అను మతులు డి.టి.సి.పి (డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ కంట్రీ ప్లానింగ్) నుంచి త్వరితగతిన సాధించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి-సురే ష్‌రెడ్డి, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమాన్ నాయక్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

పెద్దపల్లి టౌన్, జూలై 31: జిల్లాలో గల సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ఆధ్వర్యంలో డీఎస్సీడీఓ నాగైలేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతుండడంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు వెంటనే హాస్టల్స్‌లో జీఎన్ఎమ్ ఏఎన్ఎం లాంటి వైద్యాధికారులను ఏర్పాటు చేసి విద్యార్థులకు వెంటనే సకాలంలో వైద్యాన్ని అందించాలని వారు తెలిపారు. విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, బెడ్లు ఇవ్వాలని శానిటరీ, దోమ తెరలను ఏర్పాటు చేయాలని వారు అన్నారు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గద్దల సిద్ధార్థ్, రోషన్, రాహుల్, శశిధర్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంపై ప్రభుత్వ నిర్లక్ష్యం..

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అంతర్గాం, జూలై 31: ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మా ణంపై రాష్ట ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బుధవారం రామగుండం తహసీల్దార్ కార్యాల యం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళనకు దిగా రు. ఈ సందర్భగా ఆ పార్టీ రామగుండం నియో జకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కార్మిక క్షేత్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐదు ఏళ్ల క్రితమే వంద కోట్ల నిధులు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటా యించకపోవడంతో ఆసుపత్రి నిర్మాణానికి నోచుకో లేదని విమర్శించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా పట్టించుకొని ఈఎస్ ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకు లు మేరుగు హనుమంత్ గౌడ్, పిడుగు కృష్ణ, కొండపర్తి సంజీవ్, గాండ్ల ధర్మపురి, బాణాల స్వా మి, మాడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన : కలెక్టర్

మంథనిరూరల్, జూలై 31: ప్రభుత్వ పాఠశా లల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల మైదానాలలో నీరు నిలువ ఉండకుండా గ్రౌండ్‌లెవెలింగ్ చేయా లని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని మండలం ఖాన్‌సాయిపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆరెంద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడవి సోమనపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, వెంకటాపూర్ గ్రామంలోని జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పను లను, పాఠశాలలోని టాయిలెట్లు, భోజనశాల, కిచెన్ ఏరియాను పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను తనిఖీ చేసి ప్రాథమిక తరగ తుల విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలను పరీ క్షించారు. విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, పిల్లలకు తప్పనిసరిగా చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ రావాలని సూచించారు. తనిఖీల్లో కలెక్టర్ వెంట మంథని ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ కె నవీన్, అసిస్టెంట్ ఇంజనీర్ అనుదీప్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్, జూలై 31: గంజాయి, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచివారితో స్నేహం చేసి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్, కామర్స్)లో విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా మంచి అలవాట్లతో ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తములుగా సమాజానికి సేవ చేసే విధంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సత్యవర్ధన్‌రావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐ రాబర్ట్, మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి శాంత, జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, కలాశాల అధ్యాపకులు వి.రవీందర్‌రెడ్డి, బి.సంపత్, జి.జాన్సన్, రమణాచారి, శశిధర్ శర్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ అద్దె బస్సులు

భగత్‌నగర్, జూలై 31: రానున్న శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అద్దె ప్రాతిపదికన వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అద్దె ప్రాతిపదికన బస్సులు అవసరమైన వారు ఆయా డిపోల్లో సంప్రదించాలన్నారు. గోదావరిఖని 9959225922, హుస్నాబాద్ 9959225930, హుజూరాబాద్ 9959225924 కరీంనగర్-1 డిపో 9959225920, కరీంనగర్-2 9959225921, మంథని 9959225923, జగిత్యాల 9959225925, కోరుట్ల 9959225928, మెట్‌పల్లి 9959225927, సిరిసిల్ల 9959225929, వేములవాడ 9959225926 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణమునకు 11 డిపోల పరిధిలో ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోవాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పడిగెల శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల శ్రీనివాస్ (44) అనే రైతు అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల రూ. 20 లక్షలు అప్పుచేసి గేదెల ఫామ్ నడిపించి నష్టాలపాయ్యాడు. బుధవారం ఉదయం శ్రీనివాస్ తన పొలం వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

● నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు

పెద్దపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 5,914 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1217 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4,697 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.715 టీఎంసీల నీళ్ళు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ ద్వారా 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ప్రాజెక్టులోకి వరద నీరు రాక పోవడంతో ఎత్తిపోతల్లో భాగంగా ఒక మోటార్‌ను నిలిపి వేశారు. ఇప్పటి వరకు సుమారు నాలుగు టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.

గాయత్రి పంప్ హౌస్ నుంచి...

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఐదో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. మూడు రోజులుగా ఐదు పంపుల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం ఓ పంపును తగ్గించారు. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా విడుదలను యదావిధిగా సాగిస్తున్నారు. 4 పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలి వెళ్తున్నది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని 4 పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది.గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరదకాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతోంది. నీటిని విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది.


గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు 14 వేల క్యూసెక్కులు...

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు 14,814 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు గాను 309.45 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.55 టీఎంసీల మేరకు నీటి నిల్వ ఉంది.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 8,278 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 36.075 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.133 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.578 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

జాలరికి చిక్కిన 30 కిలోల చేప


30కిలోల భారీ చేపతో జాలరి కూర పురుషోత్తం

కరీంనగర్ టౌన్, జూలై 31: కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ)లో బుధవారం జాలరి చేపలు పడుతుండగా 30 కిలోల భారీ చేప వలలో పడింది. కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన జాలరి కూర పురుషోత్తం ఎల్ఎండీలో చేపల వేటకు వెళ్లాడు. ఆయన వల వేయగా 30 కిలోల చేప (బొచ్చె) వలలో పడింది. దీనితో ఆయనతో పాటు అక్కడనున్న జాలర్లు, సందర్శకులు ఆ చేపను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎల్ఎండీ జలాశయంలో ఇంత పెద్ద చేప దొరకడం అరుదని పురుషోత్తం తెలిపారు. ఈ చేపను కిలో 110 రూపాయల చొప్పున 3,300 రూపాయలకు విక్రయించాడు.

దుర్శేడ్‌లో ఇద్దరికి డెంగ్యూ

కరీంనగర్ రూరల్, జూలై31: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఇటీవల రెండు డెంగ్యూ కేసులు నిర్ధారణ అయ్యాయి. గ్రామానికి చెందిన బుర్ర ప్రణయ్, వడ్లూరి లక్ష్మీకి మూడు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండగా డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. వెంటనే మండల అధికారులు గ్రామానికి చేరుకుని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పలు కాలనీల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించారు. ఇళ్లల్లో నీరు నిలిచిన వాటిని గుర్తించి తొలగించారు. మండల పంచాయతీ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి సంజీవరెడ్డి, ఆశా వర్కర్లు గ్రామంలో పర్యటించి డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, జూలై 31: గంభీరావుపేట మండలం ముచ్చర్ల తండాకు చెందిన భూక్య దేవదాస్ (45) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని దేవదాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఇల్లు కట్టడం వల్ల దేవదాస్ అప్పుల పాలయ్యాడు. ఏడాది కిందట తన కొడుకు గల్ఫ్‌లో మృతి చెందాడు. మరోవైపు అప్పుల ఒత్తిళ్ల కావడంతో దేవదాస్ మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి, జూలై 31: వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలో బుధవారం రాత్రి గిరిజన రైతు పురుగుల మందు తాగి ఉత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం బాబాయ్ చెరువు తండాకు చెందిన అజ్మీరా రాజు అనే గిరిజన రైతు అటవీ భూముల్లో పంటను సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనరైతు అటవీ శాఖ బీట్ అధికారి కిరణ్ మధ్య వాగ్వాదం జరిగింది. తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఎల్లా రెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఫారెస్ట్ బీట్ అధికారి తనపై దాడిచేశాడంటూ అవేదన చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాజు తెలిపాడు. ఈ సంఘటనపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్‌ను వివరణ కోరగా అటవీ భూమిని సాగు చేస్తున్నాడనే సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లిన బీట్ అధికారిపై గిరిజన రైతు రాజు దాడి చేసినట్లు పేర్కొన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,జూలై31:మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొర్కల్ గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. టాక్టర్ డ్రైవర్ అజారోద్దిన్ ఓనర్ వీరవేణి అంకుస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐతెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే కటిన చర్యలుంటాయన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

- ఏసి చంద్రశేఖర్ మెదక్‌కు బదిలీ - కొండగట్టు ఈఓగా రామకృష్ణారావు

కరీంనగర్ కల్చరల్, జూలై 31: దేవాదాయ శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిని, అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి బదిలీల ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్‌గా, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ ఇంచార్జ్ ఈఓగా ఉన్న ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లా ఏసిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరో ఒకరు సీనియర్ అధికారి అదనపు బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కొండగట్టు ఆలయ ఈఓగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం రామకృష్ణారావు రానున్నారు. నిజామాబాద్ ఇంచార్జ్ ఏసీగా, కరీంనగర్ కార్యాలయంలో సూపరెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియ స్థానంలో బాసర ఇంచార్జ్ ఈఓగా ఉన్న విజయరామారావు రెగ్యులర్ నిజామాబాద్ ఏసిగా వ్యవహరించనున్నారు. అలాగే పలువురు ఈఓలకు కూడా స్థాన చలనం జరిగింది. ఇటీవల గ్రేడ్-2 ప్రమోషన్ పొందిన నాగారపు శ్రీనివాస్ కరీంనగర్ జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయానికి బదిలీ అయ్యారు. ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 ఈఓ సుధాకర్‌ను కరీంనగర్ మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో గ్రేడ్-2 ఈఓగా పనిచేస్తున్న ఎండపల్లి మారుతి గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ఈఓగా బదిలీ అయ్యారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత అలయంలో పనిచేస్తున్న గ్రేడ్-2 ఈఓ నాగుల అనిల్‌కుమార్ తిమ్మాపూర్ మండలం నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గ్రేడ్-2 ఈఓ శంకరయ్య మంథని లక్ష్మీనారాయణ దేవాలయానికి బదిలీ అయ్యారు. జగిత్యాల రాజరాజేశ్వరస్వామి దేవాలయ ఈఓగా ఉన్న కాంతారెడ్డి స్థానంలో పి వామన్‌రావు బాధ్యతలు చేపట్టనున్నారు.

ముగ్గురు కోళ్ల దొంగల అరెస్టు

సుల్తానాబాద్, జూలై 31: జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం విలువైన కోళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాటు కోళ్లు, విలువైన పందెం కోళ్లను దొంగతనం చేయడం వృత్తిగా ఎంచుకున్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన చీటి సతీష్‌రావు ఇంటివద్ద గల కోళ్ల ఫారం నుంచి ఇరవై కోళ్లను ఈ నెల 26న కారులో వచ్చి ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోళ్లను ఎత్తుకెళ్లింది ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మేచర్ల ఏసుబాబు, వీర్లపాడు మండలం గోకరాజుపల్లి కాలనీకి చెందిన గ్యార విష్ణు, జమ్మాళం బీసీ కాలనీకి చెందిన మేచర్ల కిషోర్‌లుగా నిర్ధారించారు. కోళ్లను అమ్ముకునేందుకు కారులో వెళుతుండగా బుధవారం ఉదయం సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. వీరి నుంచి 22 కోళ్లను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన వారిలో కిషోర్‌పై ఐదు కేసులు, విష్ణుపై రెండు కేసులు, మేచర్ల ఏసుబాబుపై ఏడు కేసులు ఆంధ్రప్రదేశ్‌లో నమోదై ఉన్నాయని వివరించారు. వీరు దొంగిలించే కోళ్ల ఒక్కొక్కటి యాభై వేల రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని, అలాంటి కోళ్లను ఎత్తుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుని జల్సా చేసుకుంటారన్నారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, పీసీలు తిరుపతి నాయక్, రమేష్, రాజ్‌కుమార్‌లను ఏసీపీ అభినందించారు. సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ

బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

చొప్పదండి, జూలై 31: మండలంలోని వెదురుగట్టుకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. ఎస్ఐ అనూష తెలిపిన మేరకు.. వెదురుగట్టుకు చెందిన జిల్లా శంకరయ్య (52)ఆటో నడుపుకుంటూ వ్యవసాయం చేస్తుంటాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా బైక్ అదుపు తప్పి శంకరయ్య కింద పడిపోయాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శంకరయ్య మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న జిల్లా శంకరయ్య మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు

గంభీరావుపేట, జూలై 31: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు వెల్లడించినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. కోనారావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన కుంట నాగరాజుకు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన వసంతతో 2005లో వివాహం జరిగింది. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నేళ్లకు అదనపు కట్నం కోసం భర్త నాగరాజు వేధింపులకు గురిచేయగా 2009లో గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో వసంత ఫిర్యాదు చేసింది. పోలీస్‌లు నాగరాజుపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యమగంటి సతీష్‌గౌడ్ వాదించారు. గంభీరావుపేట ఎస్సై, సీఎంఎస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్‌రెడ్డి ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో నిందితుడు నాగరాజుకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ న్యాయమూర్తి సృజన తీర్పు చెప్పినట్టు ఎస్సై వివరించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

వీణవంక,జూలై31:మండలంలోని బొంతుపల్లి గ్రామనికి చెందిన పోలు సత్తమ్మ (84)బావిలో పడి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం బహిర్భుమికి వెళ్లి చాలాసేపు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో ఇంటి దగ్గరలోని బావిలో వెతకగా శవమై కనిపించినట్లు తెలిపారు.మా తల్లి మతిస్థిమితం సరిగా లేక బహిర్భుమికి వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్టు మృతురాలు కూమారుడు పోలు మల్లేష్ పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఇసుక డంపులపై పోలీసుల దాడులు

మానకొండూర్, జూలై 31 : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు 40 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకొని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు లింగాపూర్‌లోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న టీఎస్ 02 యుసి 9929 ఇసుక ట్రాక్టర్‌ను మండలంలోని అన్నారం గ్రామంలో పట్టుకొని డ్రైవర్ అనిల్, యజమాని తాళ్ల సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

మానకొండూర్, జూలై 31 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ నేర్నాల శ్యాం, యజమాని పిల్లి మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

కరీంనగర్ అర్బన్, జూలై 31: ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. కోరుట్లలో విధులు నిర్వహిస్తున్న జ్యోతి ఐజీ కార్యాలయానికి, డీఐజీ కార్యాలయంలో పనిచేసే డి సుజాత జగిత్యాలకు బదిలీ అయ్యారు. డి అశోక్ ఆదిలాబాద్ నుంచి కోరుట్లకు బదిలీ అయ్యారు. జె షన్‌నాయక్ జగిత్యాల నుంచి భీమదేవరపల్లికి, ఎండీ మక్సూద్ అలీ హుజూరాబాద్ నుంచి ఆదిలాబాద్ అడిట్‌కు బదిలీ అయ్యారు. ఎం బాలకిషన్ లక్షెట్టిపేట నుంచి రామగుండం, అప్పారావు సుల్తానాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. బి ప్రియాంక మంథని నుంచి మంచిర్యాలకు, ఎల్ ఉమాదేవి కరీంనగర్ డిఐజీ కార్యాలయం నుంచి అడిట్‌కు, జె మనోహర్ కరీంనగర్ అడిట్ నుంచి చేర్యాలకు, ఎస్ రాజేష్ కరీంనగర్ రూరల్ నుంచి గజ్వేల్‌కు, జె పద్మ గంగాధర నుంచి ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎస్‌పార్థసారథి సిరిసిల్ల నుంచి కరీంనగర్ డీఐజీ కార్యాలయానికి, సీహెచ్ సురేంద్రబాబు వేములవాడ నుంచి ఎల్లారెడ్డికి, ఆర్ వెంకటవీరస్వామి రామాయంపేట నుంచి సిరిసిల్లకు, ఎండీ ఇంతియాజ్ హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్‌కు, అఫ్జల్‌నూర్‌ఖాన్ ఎల్లారెడ్డి నుంచి గంగాధరకు, ఎండీ అబ్దుల్ జబ్బర్ దోమకొండ నుంచి హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇసుక లారీల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 31: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వాగు నుంచి లారీలలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలోని పెద్దకాల్వల, బాబుపేట్, తారకరామానగర్ గ్రామాలకు చెందిన వాహన డ్రైవర్లు గుండవేని నాగేష్, దూల వెంక టేష్, పల్లపు కుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బీమా చెక్కులు అందజేత

కరీంనగర్ క్రైం, జూలై 31: ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బుధవారం అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు) ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఉమ్మడి జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి అందిన ఇన్సూరెన్సు చెక్కులను అందజేశారు. సిరిసిల్ల జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి, కామారెడ్డి జిలాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి వేర్వేరుగా నాలుగు లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ - కమిషనరేట్‌లో వన మహోత్సవం

కోల్‌సిటీ, జూలై 31: వాతావరణ కాలుష్యంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యా భారిన పడుతున్నారని, మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఉంటుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమబాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కమిషనరేట్ ఆవరణలో 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మనల్ని మనం కాపాడుకోవడం కోసం భావితరాలకు సమతూల్య వాతావరణం అందించేందుకు మొక్కలు నాటాలన్నారు. మొక్కలు చెట్లుగా ఎదిగి కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను ఇవ్వడం ద్వారా జీవకోటిని రక్షిస్తున్నాయన్నారు. వర్షాలు కురువాలన్నా, వేడి ప్రభావం తగ్గాలన్నా కాలుష్య నివారణ కావాలన్నా



మొక్క నాటుతున్న సీపీ శ్రీనివాస్

వృక్షాలే ప్రధానమన్నారు. ప్రతి ఒక్కరూ ఈచ్ వన్ ప్లాంట్ వన్ అనే నినాదంతో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర కమిషనర్ శ్రీకాంత్, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహాలు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఏవో అశోక్‌కుమార్, ఆర్‌ఐలు, సీఐలు పాల్గొన్నారు.

దేశవాళి పంటల సాగును ప్రోత్సహించాలి

పెద్దపల్లి టౌన్, జూలై 31: విదేశీ ఆయిల్ పామ్ నూనెల కన్నా పోషకాలుగల దేశవాళి నూనెగింజల సాగును ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర గాండ్ల కుల వృత్తి నూనె ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కం మారుతి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయిల్‌పామ్ చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ల పాటు 21వేల రూపాయల ప్రోత్సాహకాలను అందిస్తున్నదని పేర్కొన్నారు. అవే డబ్బులు పోషకాలుగల దేశవాళి నూనెపంటలైన వేరుశెనగ, నువ్వులు, ఆవాలు, పొద్దుతిరుగుడు, కుసుమ, కొబ్బరి పంటలు సాగు చేసే రైతులకు ఇవ్వాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో దేశవాళి పంటలను ప్రోత్సహించే బడ్జెట్ కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

కోల్‌సిటీటౌన్, జూలై 31: రామగుండం నియోజకవర్గానికి చెందిన గోలివాడ ప్రసన్న కుమార్ బుధవారం నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ సమక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సునీల్‌జాదవ్ ప్రసన్న కుమార్‌కు కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రసన్నకుమార్ గతంలో బీఎస్పీ రామగుండం ఇంచార్జీగా, కాంగ్రెస్ సేవా దళ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడిగా ప్రసన్న పనిచేశాడు.

ఉపాధ్యాయులకు శిక్షణ

జూలపల్లి, జులై 31 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, తెలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల కాంప్లెక్స్ మీటింగ్ బుధవారం జాతీయ సాదన సర్వే(ఎన్ఏఎస్)పై ఉపాద్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కమాన్‌పూర్, జూలై 31 : మండలంలోని పెంచికల్‌పేట గ్రామానికి చెందిన దబ్బేట పుష్పలతను తెలంగాణ కళావేదిక రాష్ట మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్, కార్యనిర్వహణ కార్యదర్శి జవ్వాజి ప్రవీణ్‌కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

కమాన్‌పూర్, జూలై 31 : ఆటోడ్రైవర్లు తమ హక్కుల సాధన కోసం హైదరాబాద్ అసెంబ్లీకి తరలివెళ్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం కమాన్‌పూర్ పోలీసులు ఆటో డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మట్ట నరసయ్య, మాజీ వైస్‌ప్రెసిడెంట్ కాసరవి, వైస్ ప్రెసిడెంట్ పోల్దాసరి సంపత్, ప్రధాన కార్యదర్శి మేడ తిరుపతి, క్యాషియర్ జంగపల్లి తిరుపతి, కార్యవర్గ సభ్యులు సంచు శ్రీను, పటాస్, అప్జల్, నర్సింగం, ఎండీ అమీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సురేష్

కమాన్‌పూర్, జూలై 31 : కమాన్‌పూర్ ఇన్‌చార్జీ ఎంపీడీవోగా మండల పర్యవేక్షణ అధికారి సురేష్‌ను నియమిస్తూ జడ్పీ సీఈవో నరేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ఇంచార్జీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కు తోటి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

షీ టీంపై అవగాహన

కోల్‌సిటీటౌన్, జూలై 31: గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి పాఠశాలలో బుధవారం షీటీంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మల్లయ్య, ఉమెన్‌కానిస్టేబుల్ స్నేహలతలు షీటీంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీమ్ పనిచేస్తుందన్నారు. ఎక్కడ కూడా మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బంది కలిగినా వెంటనే షీటీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ నేరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. షీటీమ్ కానిస్టేబుల్ సురేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, జూలై 31: రెండు కిడ్నీలు చెడిపోయిన నిరుపేద విద్యార్థిని సిరి వైద్య చికిత్స కోసం నీడ స్వచ్చంద సంస్థ 1000, సమాజం కోసం గ్రూపునుంచి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. గోదావరిఖనిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్థికసహాయం అందజేశారు. రెండు కిడ్నీలు చెడిపోయిన ప్రభుత్వ కళాశాలలో చదివి 1000కి 927 మార్కులు సాధించడం అభినందనీయమని నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్, శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పేర్కొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

సుల్తానాబాద్, జూలై 31: నిర్బంధాలు, అక్రమ అరెస్టులు సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి సునిల్ అన్నారు. అసెంబ్లీ బడ్జేట్ సమావేశాల సందర్బంగా ప్రభుత్వం దృష్టికి కార్మికుల సమస్యలను తెలుపడం కోసం హైదరాబాద్ వెళుతున్న తమను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో శ్రీకాంత్, లీలావతి, లావణ్య, గౌరమ్మ, రజిత ఉన్నారన్నారు.



కాలనీలో తనిఖీలు చేస్తున్న ఏసీపీ రమేష్, పోలీసులు

పీకే రామయ్యకాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

జ్యోతినగర్, జూలై 31: ఎన్టీపీసీలోని పీకే రామయ్య కాలనీలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్(కమ్యూనిటీ కాంటాక్ట్) నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆద్వర్యంలో రామగుండం సీఐ ప్రవీణ్‌కుమర్, ఎన్టీపీసీ ఎస్ఐ సతీష్, పోలీసులు కాలనీలో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్బంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో ఉంటున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు రక్షణగా ఉంటారనే భరోసా కల్పించేందుకు తనిఖీలు నిర్వహించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. పోలీసులకు ప్రజలు అన్ని విషయాలలో సహకరించాలని కోరారు.

పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్

ముత్తారం, జూలై 31: మండలంలో పెండింగ్ ఉన్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ సందర్శించి మండలంలో పెండింగ్ ఉన్న ధరణి సమస్యలు, భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి త్వరగా జారీచేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

ఈ సమావేశంలో తహసీల్దార్ సుమన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

రిటైర్‌మెంట్ తర్వాత ఆనందంగా గడపాలి : సీపీ



రిటైర్ అయిన అధికారులను సన్మానిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూలై 31: పోలీస్ అధికారులు, సిబ్బంది రిటైర్‌మెంట్ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. గురువారం కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బందిని కమిషనర్ సత్కరించారు. ఎస్ఐలు ఎం రాజేంద్రప్రసాద్, దత్తు ప్రసాద్‌శర్మ, అబ్దుల్ సత్తార్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామగుండం నగర కమిషనర్ శ్రీకాంత్, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహాలు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఏఓ అశోక్‌కుమార్, ఆర్‌ఐలు, బోర్లకుంట పోచలింగం, స్వామి పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఎన్టీపీసీలో పోచమ్మ బోనాలను తీసుకవెళ్తున్న మహిళలు

జ్యోతినగర్, జూలై 31 :ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్(పీటీఎస్)లో బుధవారం ఆషాఢం బోనాలను ఘనంగా నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణ నుంచి మహిళలు తలపై బోనాలను ఎత్తుకొని రింగ్ రోడ్డు వద్ద ఉన్న పోచమ్మ గుడి వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపు కొనసాగింది. అనంతరం పోచమ్మకు మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కొలని వెంకట్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, ఆరెపెల్లి రాజేశ్వర్, భాస్కర్ యాదవ్, సత్తయ్య, భానేశ్వర్, మాజీ కార్పొరేటర్ కొలని కవిత, సంధ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు కరువు

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష



జ్వర పీడితులను పరామర్శిస్తున్న దాసరి ఉష

సుల్తానాబాద్, జూలై 31: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి వైద్య సదుపాయాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష విమర్శించారు. ఉష బుధవారం స్థానిక ఆసుపత్రిని సందర్శించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాసరి ఉష విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం రాత్రి కూరగాయలు అమ్ముకునే ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరితే ఆమెకు ఎలాంటి చికిత్స అందించకుండానే ఇంజక్షన్లు, మందులు లేవంటూ కరీంనగర్ పొమ్మన్నారని తెలిపారు. వందలాది మంది ప్రజలు జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారని వారికి రక్తపరీక్షలు చేయడంలో గంటల కొద్దీ కాలయాపన జరుగుతోందన్నారు. సుల్తానాబాద్ ఆస్పత్రిలోనే ల్యాబ్‌కు సంబంధించిన అన్ని ఆధునిక పరికరాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచకపోవడంతో పాటు ఈసారి బడ్జెట్‌లో కూడా 910కోట్ల నిధులు తగ్గించారన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు పెద్ద దిక్కుగా ఉండాలని, కానీ అందులో సరిపడా మందులు అందుబాటులో ఉంచకుండా పేదలను ఇబ్బందులపాలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంట బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెండ్ వాహద్, కౌన్సిలర్ మమత పసెడ్ల సంపత్, మాజీ ఎంపీటీసీ గుర్రం సంపత్, కుమార్, ప్రశాంత్, కల్వల రాజు, అర్జున్, శ్రావణ్, అనూష, సాగర్ తదితరులు ఉన్నారు.



ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన గనులను రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 31: తెలంగాణలోని రెండు బొగ్గు బ్లాక్‌లను వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ప్రకటనలో పేర్కొన్నారు. సత్తుపల్లి ఓసీపీ, కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను ప్రైవేట్ సంస్థలు వేలంలో దక్కించుకున్నాయని తెలిపారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీపీని అవంతిక, కోయగూడెం ఓసీపీని అరబిందో కంపెనీలు దక్కించుకున్నట్లు రియాజ్ పేర్కొన్నారు. జేవీఆర్ ఓసీపీని అవంతి సంస్థకు దక్కేలా కొందరు సింగరేణి అధికారులు కుట్ర చేసినట్లు ఆయన ఆరోపించారు. ఎంఎండీఆర్ 2015 యాక్టు పరిధి నుండి తెలంగాణను మినహాయించాలని డిమాండ్ చేశారు. మైనింగ్‌లో అపార అనుభవం, నైపుణ్యంగల కార్మికులు ఉన్న సింగరేణికి రాష్ట్ర పరిధిలోని గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గనులు సింగరేణికి కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

అధికారులకు ఘన సన్మానం

శ్రీరాంపూర్, జూలై 31 : దేశవ్యాప్తంగా బొగ్గు గనులకు ఇచ్చే అవార్డు శ్రీరాంపూర్‌లోని ఆర్కే5 గని అందుకోవడానికి కృషిచేసిన గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, రక్షణాధికారి శివయ్య, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ చందా ప్రవీణ్‌ను బీఎంఎస్ పిట్ కార్యదర్శి గోనె రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి కట్ట ఈశ్వరాచారి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ కేటగిరి కింద మైన్ సేఫ్టీ అవార్డు-2024ను ఆర్కె-5గనికి దక్కడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, జీడీ ప్రభాకర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, ఆఫీస్‌ఇన్‌చార్జి దొంతుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం..

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

గోదావరిఖని, జూలై 31: సింగరేణిని ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రజా పోరాటాలతో కేంద్రం మెడలు వంచుతామని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర బుధవారం గోదావరిఖనికి చేరుకోగా సాయంత్రం చౌరస్తాలో బహిరంగ నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి తీవ్ర పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని రాఘవులు పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థను ప్రైవేట్‌పరం చేస్తే సింగరేణిపై ఆధారపడిన వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, దీంతోపాటు ప్రభుత్వం కూడా నష్టపోయే అవకాశం ఉందన్నారు. సింగరేణి సంస్థ లాభాల్లో ఉందని, ఈ లాభాల్లోని కొంత నిధులు ప్రజల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వం సింగరేణికి వేల కోట్ల రూపాయల అప్పు ఉందని, అయినప్పటికీ ప్రజల అభివృద్ధి కోసం సింగరేణి నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థ ప్రైవేటుపరం అయితే ప్రజల అభివృద్ధి కోసం ప్రైవేటు కంపెనీలు నిధులు కేటాయించే అవకా శం లేదన్నారు. ప్రజల అభివృద్ధి జరగాలంటే సింగరేణి సంస్థను మనంద రం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తామని మోదీ ప్రభుత్వం అంటే 4వేలమంది కార్మికులు ఉద్యమించడంతో కేంద్ర మంత్రి స్వయంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయబోమని చెప్పారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణిలో బొగ్గు గనుల వేలంను వ్యతిరేకించినట్టు లేదని, బొగ్గు మంత్రి వేలం వేయాలని పెట్టిన మీటింగ్‌లో స్వయంగా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పాల్గొని కూడా సింగరేణి వేలంలో పాల్గొనదని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని తెలియచేయాలన్నారు. యాత్ర రథసారధి ఎస్ వీరయ్య, బృంద నాయకులు భూపాల్, ఆశయ్య, పీ రాజారావులు మాట్లాడుతూ ఒకవైపు సీపీఎం అధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ యాత్ర జరుగుతుంటే



బహిరంగ సభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

మరోపక్క కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల విషయంలో ఇంతకు ముందున్న చట్టాలను సడలించి ప్రైవేటు వ్యక్తులు కూడా ప్రభుత్వ భూములు కొనుక్కునే అవకాశం కల్పించడం కోసం చట్టాలను సడలించారన్నారు. దీనివల్ల పేదలు ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న గుడిసెలు కూడా తొలగించే అవకాశం ప్రైవేటు పెట్టుబడిదారులు చేస్తారన్నారు. అందుకే ప్రజలందరూ పోరాడి సింగరేణి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో అన్ని వర్గాల వారిని కలుపుకుని పోరాడుతామని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో సీఐటీయూ, సీపీఎం నాయకులు మందా నర్సింగ్ రావు, ఎ ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, ఏ మహేశ్వరి, ఎం రామాచారి, జ్యోతి, శంకర్, గణేష్, కొమురయ్య, ఎం శ్రీనివాస్, రవీందర్, అశోక్, సంకే రవి, బిక్షపతి, నర్సయ్య, నాగమణి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్‌ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జూలై 31: గ్రామాల్లో పారిశుద్ద్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రాఘవపూర్ గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్మికులకు డీఎల్‌పీవో వేణుగోపాల్ రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. అనంతరం డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఫయాజ్ అలీ, పంచాయతీ కార్యదర్శి తూముల రవి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూలై 31: మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌గౌడ్ తండ్రి బండారి చంద్రయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. వారి వెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, జూలై 31: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 9న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి దుర్గ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీలో మాదిగల మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి మాదిగలు, విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కాలయాపన లేకుండా తక్షణమే వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని చేపట్టే మహా ధర్నాకు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో మాదిగలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు మల్లేశం, రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి లక్ష్మన్, పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి పెర్క నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ఎంపీవోలకు సన్మానం

ఓదెల, జూలై 31: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నూతనంగా నియామకమైన పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీడీవో తిరుపతి, ఎంపీఓ షబ్బీర్ పాషాలను సన్మానించారు. అంతకుముందు ఇక్కడున్న గ్రామపంచాయతీ కార్యదర్శులను ఉన్నతాధికారులు బదిలీ చేయగా, వీరి స్థానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22 మంది కార్యదర్శులు విధుల్లో చేరిన అనంతరం ఎంపీడీవో,ఎంపీవోలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

పెద్దపల్లి రూరల్, జూలై 31: మండలంలోని చీకురాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెళ్లే దారి బురదమయంగా మారడంతో బుధవారం ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మరమ్మతు చేయించారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వారి వెంట మండల విద్యాధికారి సురేంద్ర కుమార్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మంథని, జూలై 31: కొన్ని రోజులుగా పట్టణంలో కురుస్తున్న వర్షాలకు మంథని మున్సిపల్ పరిధిలో గల 7వ వార్డు ఉస్మాన్‌పుర లోని షైనాజ్ గారి ఇల్లు కూలిపోగా బాధితురాలికి బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇనుముల సతీష్ సూచన మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్ల బృందం సందర్శించి కూలిన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం స్థానిక తహసీల్దార్ రాజయ్య దృష్టికి తీసుకొని వెళ్లి బాధితురాలికి తక్షణ సహాయం కింద విడుదల చేసిన 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వీకే. రవి, కొట్టె పద్మ-రమేష్, వేముల లక్ష్మి-సమ్మయ్య, నక్క నాగేంద్ర-శంకర్, స్థానిక మాజీ వార్డు సభ్యులు ఇనుముల సతీష్, కాంగ్రెస్ నాయకులు వలీ, మహబూబ్, అఫ్రోజ్‌లు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల హక్కుల సాధనకు కృషి

పెద్దపల్లిటౌన్, జూలై 31: గొర్రెల కాపరుల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం పని చేయాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఆ సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షులుగా నియామకమైన సలేంద్ర రాములు యాదవ్‌ను పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో బుధవారం ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని రాములు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల అధ్యక్షులు దాడి చంద్రమొగిలి, ఆముల భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మన్, నాయకులు నర్ల అంజయ్య, పర్ష సమ్మయ్య, పెగడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'



లీడర్‌కు బ్యాడ్జి పెడుతున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, జూలై 31: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, జూనియర్ కళాశాలలో బుధవారం క్యాబినేట్ కమిటీ ఎంపిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో చురుకైన విద్యార్థులను క్యాబినేట్ కమిటీకి ఎన్నుకున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెపచడంలో భాగంగా కమిటీని ఎన్నుకున్నామని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈడీ కేదార్ రంజన్‌పాండు మాటాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సిక్దర్, డీజీఎం ప్రవీణ్‌కుమార్, ఎ.కె.పాండే, సచ్‌దేవ ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పదవీ విరమణ ఉద్యోగులు

జ్యోతినగర్, జూలై 31 : రామగుండం ఎన్టీపీసీలో బుధవారం పదవీ విరమణ చేసిన 9 మంది ఉద్యోగులు బుధవారం టౌన్‌షిప్‌లో మొక్కలు నాటారు. రిటైర్‌మెంట్ రోజు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో యాజమాన్యం మొక్కలు నాటించడం ఆనవాయితీగా ఉన్నది. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు, ఏజీఎం సిక్దర్, రిటైర్డ్ ఉద్యోగులు ఇ.విష్ణువర్ధన్‌రావు, కందులస్వామి, ఎ.జె.నాయుడు, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్ రావు, అబ్దుల్ కరీం, గౌతం కుమార్ హల్దార్, కోటి డేవిడ్, చిట్టి శ్రీనివాస్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

కరీంనగర్ టౌన్, జూలై 31: రజకుల సమస్యల సాధనకు సంఘటిత ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరముందని తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ రజక అన్నారు. బుధవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పూసాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ నరేశ్, కార్యదర్శిగా మునిగంటి అశ్విన్, ఉపాధ్యక్షులుగా తడిగప్పుల శ్రీపాల్, గుండేటి రాజు, పొన్నాల శ్రీనివాస్, నేరెళ్ళ లక్ష్మన్, ఆర్గనైజర్లుగా వెదిర వెంకటేశ్, సుందరగిరి చంద్రయ్య, బూత్కూరు శంకర్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పుల్లంగుల శ్రీనివాస్, పెండ్యాల మధూకర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.